# మౌనమే నీ భాష...!

రామ్‌జీ - రావ్‌జీ

ఆదివారం...

కాకినాడలో కవి సమ్మేళనం ముగిసేసరికి రాత్రి పదయింది.

సభ ఐదున్నరకే అవడం వల్ల ఆదరాబాదరాగా మూడింటికే వాళ్ల ఊరు నుంచి బయలుదేరాడు శేషగిరి. అంటారే గాని అన్నవేళకి సభ ఎప్పుడూ ప్రారంభించరని తెలుసు. అయితే - ఏదో అరగంటో, గంటో లేటవుతుందనుకున్నాడు గాని, మరీ గంటన్నర వరకూ డేకుతుందనుకోలేదు. కవులంటే మేధావులూ, సంస్కరణాభిలాషులూ అనే పేరుంది. మరి ఇదేం సంస్కృతి?

కాకినాడలో దగ్గర బంధువులెవరూ లేరు. ఉన్నా 'భోజనం' అంటూ వాళ్ళని బాధపెట్టడం భావ్యం కాదనే మనస్తత్వం శేషగిరిది. పైగా అది టైమూ కాదు. ఎంత లేటయినా ఇల్లు చేరడమే మంచిదనిపించింది. కాంప్లెక్స్ చేరాడు. పదకొండు దాటింది. బస్సు అందుకోడమే జరిగితే ప్రయాణం ఓ గంట. 'గంట' అన్నది బస్సు బయలుదేరడాన్ని బట్టీ ఉంటుంది. బయలుదేరడం బస్సు రావడాన్ని బట్టీ ఉంటుంది. చాలా చిరాకుగా ఉంది అతనికి. ఇంతకీ అసలు ఆ టైములో వచ్చే బస్సు ఏదైనా ఉందో లేదో! కవిలా కనబడుతున్న ఓ యువకుణ్ణి, తనలాగే హాఫ్ సూట్‌ల ఉన్న మరో మధ్య వయస్కుణ్ణీ అడిగాడు.

"నేనే మిమ్మల్ని అడగాలనుకున్నాను. మీరే నన్ను అడుగుతున్నారు. రియల్లీ ఎ వండర్" అన్నాడు కవి. దూరదర్శన్ భాషల్లో 'తెలియదండీ' అన్నాడు హాఫ్ సూట్ జంటిల్మన్. చుట్ట తాగుతూ కూర్చున్న వాణ్ణి ఎవరినైనా అడగడం బెటరనిపించింది శేషగిరికి.

'అన్నట్టు ఎంక్వయిరీ ఉందికదా...' అనుకుంటూ అక్కడికి వెళ్ళాడు.

"పేమంట్ ఎప్పుడు పోతాదో డాక్టర్లే చెప్పలేకపోతున్నారు. బస్సు ఎప్పుడు వస్తుందో మేం మాత్రం ఏం చెప్పగలం చెప్పండీ" అన్నాడు యూనిఫాంలో ఉన్న ఒకాయన.

ఎలాగైతేనేం, తేదీ మారిన ఓ గంటకి అతన్ని వాళ్ళ ఊరు చేర్చింది ఓ బస్సు. తనతో దిగిన వారు ఇద్దరే. వాళ్ళు వంచెలు ఎగ్గట్టి కాళ్ళకి పని కల్పించారు. తను ఆఫీసరు కదా. రిక్షాల కోసం చూశాడు. ఏం లేవు.

'ఇల్లు చాలా దూరం. ఇప్పుడేం చెయ్యాలి...' అనుకుంటూండగా ఓ రిక్షా వచ్చింది.

'రండి సార్..' అన్నాడు రిక్షా అతను. చూస్తే చాలా నీటుగా ఉన్నాడు. చక్కని క్రాఫ్. మంచికలర్. ఇస్త్రీ చేసిన నిక్కరు, చొక్కా. చేతికి కొత్త వాచీ.

"అర్ధరాత్రి వేళ - రిక్షాకి ఏ వది రూపాయలడుగుతాడో" అని పించింది శేషగిరికి.

"రత్నంపేటకి ఏమివ్వాలి?" అడిగాడు.

"తమకి తోచినంత ఇవ్వండి. మీ యిల్లు నాకు తెలుసులెండి" అన్నాడతను.

ఆ మాట చాలా నమ్రతగా ఉంది.

ఇరవై కిలో మీటర్ల దూరంలో ఉన్న పక్క ఊళ్లో ఆఫీసుకి రోజూ పొద్దున్నే బస్సులో వెళ్ళే శేషగిరికి చాలా రిక్షావాళ్ళు తెలుసు కాని, ఇతనిని ఎప్పుడూ చూసినట్టు లేదు. తన వయస్సు వాడే అతనూను. అంటే నలభై రెండో, నలభై మూడో.

"మీకు తోచినంత ఇవ్వండి అంటున్నావ్... ఎంతో చెప్పు మరి.. మళ్ళీ ఆ తర్వాత..." అని అతను అంటూండగానే.

"నాతో పేచీ ఏం రాదు లెండి - మీరు ముందు బండిలో కూర్చోండి. అసలే వేళ కాని వేళ - పైగా పైన మబ్బులు కమ్ముకుంటున్నాయ్ - మీరు చూశారో లేదా" అన్నాడు రిక్షావాలా.

శేషగిరి రిక్షా ఎక్కుతూంటేనే హోరున వర్షం ప్రారంభమైంది.



"ఒకాస్తంత ఉండండి బాబూ" అంటూ సీటు క్రింద పెట్టిలోంచి రైన్ కోటు తీసుకుని తొడుక్కున్నాడు రిక్షా అతను.

శేషగిరి రిక్షాలో కూర్చున్నాడు.

వానకి తడుస్తూ అలా రిక్షా తొక్కుతూనే ఉన్నాడతను. జాలేసింది. శేషగిరికి.

ఇల్లు చేరాక ఐదు కాగితం ఇచ్చాడు శేషగిరి. మాట్లాడకుండా తీసుకున్నాడతను. న్యాయంగా అయితే ఎనిమిదో పదో ఇవ్వచ్చు.

రిక్షా అతను వెళ్ళాక - 'ఉత్త అమాయకుడిలా ఉన్నాడు' అనుకున్నాడు గిరి.

తర్వాత రెండు మూడు నెలల్లో శేషగిరి ఐదారుసార్లు అతని రిక్షా ఎక్కడం జరిగింది. అతని పేరు సూర్యం అని తెలిసింది. అతని రిక్షా ఎప్పుడు చూసినా నిగనిగలాడుతూ ఉండటం గమనించాడు. నీట్‌నెస్‌కి తగిన సంస్కారమూ ఉంది.

ఓ రోజున మెయిన్ రోడ్డు మీద ట్రాఫిక్ జామ్ వల్ల రిక్షా చాలాసేపు ఆగిపోయింది. సూర్యం రిక్షాకి బ్రేక్‌వేసి ప్రక్కనే నుంచున్నాడు. శేషగిరి మాత్రం రిక్షా దిగలేదు.

"ఏం సూర్యం - నువ్వు ఫామిలీతోనే ఉంటున్నావా ఈ ఊళ్ళో" అన్నాడు.

"ఔనండి - ఊరు చివర కాలేజీ దాటాకండి మా ఇల్లు" అన్నాడతను.

"పిల్ల లెంత మంది?"

"నలుగురు పిల్లలూ - ఒక భార్యానండి"

నవ్వొచ్చింది శేషగిరికి. "భార్య అంటే చాలదూ? ఒక భార్య అంటావేంటి?" అన్నాడు.

"ఔనండి - ఒక భార్య కంటె ఎక్కువ ఉన్నవాళ్ళు లేరా? అందులోనూ ఈ రోజుల్లో!" అన్నాడు సూర్యం.

ఎందుకోగాని చురుక్కున తగిలిందామాట శేషగిరికి.

"ఔన్లే .. అది సరే - పిల్లలు చదువుకుంటున్నారా?" అన్నాడు.

"నాకు నా ఇరవయ్యో ఏటే పెళ్ళి చేసేసాడండి మా నాయన. మా పిల్లల్లో అందరికంటె పెద్ద మా పెద్దోడండి. మొన్న ఏకాదశికి వాడికి ఇరవై నిండాయండి. నాలుగేళ్ల క్రితం టెన్త్ అయ్యాక వాణ్ణి చదువు మానిపించేసి పొలంపనులు చూసుకోమని మా ఊరు పంపేసానండి. మాదసలు శ్రీకాకుళం. అక్కడ కరువు కాటకాలకి తట్టుకోలేక పదేళ్ల క్రితం ఇక్కడికొచ్చాసానండి. అక్కడ మాకు రెండెకరాల పొలం ఉందండి. నేను అప్పట్లో పొలంపనే చేసేవాడినండి. ఇక్కడికొచ్చాక-ఇదిగో ఈ రిక్షా మొదలెట్టాను" అన్నాడు సూర్యం.

"అదేమిటయ్యా- లక్షణంగా చదువుకుంటూన్న కుర్రాణ్ణి చదువు మానిపించేసి పొలంపనుల మీద పంపడమేమిటి?"

"మీరు పెద్దవారు- మీకు చెప్పదగ్గవాణ్ణి కాదనుకోండి- అయినా అడిగారు కనుక చెబుతున్నాను. ఈ చదువు లెందుకండీ. జ్ఞానం అంటే అక్షరజ్ఞానమే కాదండి- విషయజ్ఞానం కూడా. మొదటిది ఓ ఉద్యోగాన్ని ఇస్తే ఇవ్వొచ్చు. రెండోది జీవితాన్నే తీర్చిదిద్దుతుంది. అందుకే చదువు మానిపించేశాను చమటోడ్చి బాగానే దిగుబడి లాగుతున్నాడండి. కిందటేడు వాడికి పెళ్ళి చేసేశానండి. మా కోడలుపిల్ల- వయస్సుకి చిన్నదైనా దేవతండి..."

వింటున్నాడు శేషగిరి.

"నెలకు రెండు ఉత్తరాలొస్తాయండి నాకు అక్కడినించి. ఒకటి తను రాస్తే రెండోది మొగుడుచేత



సినిమా మాటింగ్ జరుగుతోంది. నెంబర్ వన్ హీరో దర్శకున్ని ఉద్దేశించి 'ఫక్తు పిచ్చి వెదవలా కనిపించాలంటే ఏం చేయమంటారు నన్ను!' సలహా అడిగాడు.

ఏమీ చేయఖ్ఖర్లేదు. మామూలుగా ఎలా ఉంటారో అలా ఉంటే చాలు! చెప్పాడు దర్శకుడు.

- కె. ప్రియాంక,
నందికొట్కూర్.

రాయిస్తుందండి మా కోడలు. మొన్నానే ఓ అర ఎకరం బేరం చేశాడటండి. సగం డబ్బు తనే ఇచ్చి, సగం బ్యాంకులో లోను తెచ్చాడట. తీర్చేస్తాడు లెండి- కష్టపడ్డం అలవాటయింది కదా" అన్నాడు సూర్యం.

"మరి రెండోవాడు? చదువుతున్నాడా?" అని శేషగిరి అడిగినదానికి-

"పెద్దోడి తర్వాత ఆడపిల్లండి. దానికి పద్దెనిమిది. పెళ్ళిచేసి పంపించేసానండి- రాజమండ్రి పిల్ల ఎర్రగా బుర్రగా ఉంటదిలెండి- అంతా వాళ్ల తల్లిపోలిక- కట్నం పెద్దగా ఏం ఇవ్వలేదండి. కుర్రాడు బాకులాంటివాడు- కిరాణా కొట్టుందండి. అన్నట్టు మా రెండోవాడి మాటకదా మీరడిగింది. వాడికి పదహారు. సినిమాల పిచ్చి జాస్తి అయ్యిందిలెండి ఆమధ్య. ఎడ్డెం అంటే తెడ్డెం అనే బావతులా తయారవుతూంటే చూశాను- ఇంతలో టెన్త్ తప్పాడు- విజయవాడలో మాకు తెలిసిన ఓ డాక్టరుగారు అడిగితే కారు క్లీనరుగా అక్కడికి పంపేశానండి. బ్రతుకంటే ,ఏంటో తెలుసుకుని వాడే పైకి వస్తాడు లెండి. ఆఖరిది మళ్ళీ ఆడపిల్లండి. దానికి పన్నెండు. సెవెన్త్ చదువుతూంది. తల్లికి కుడిభుజంలా ఉంటుందండి" అన్నాడు సూర్యం.

"ఔనూ- నువ్వెంతవరకూ చదివావ్?" అన్నాడు.

"అలాఁ... నా చదువు మాటకేం లెండి" అన్నాడతను.

"అలాకాదు- ఏం- చెబితే తప్పేముంది...?"

"పెద్దగా నేనేం చదవలేదండి- పది వరకూ చదివి తర్వాత ఇక ఇష్టంలేక ఆగిపోయాను- బి.ఎ. వరకూ చదివేనే అనుకోండి- ఉద్యోగం చెయ్యాలి. ఉద్యోగం అనగానే మనిషి స్వతంత్రానికి కళ్ళెం వడ్డట్టే గదండీ- మనిషికి స్వేచ్ఛ ఉండాలని నా ఉద్దేశం. ఉద్యోగంలో ఎదుగు బొదుగుల మాట చెప్పలేం. ఎందుకంటారేమో- పై అధికార్లు మన్ని ఎదగనివ్వరు. ఏటా జీతం పెరుగుతుందేమో గాని జీవితం వికసించదు. మనిషి బ్రతకడానికి చదువు కంటెముందు ఆత్మవిశ్వాసం ముఖ్యం. ఒక ప్లాన్ ఉండాలి. చీకూ చింతా లేకుండా కాపురాలు చేసుకుంటూన్న వాళ్లు కోట్లాదిమంది ఉన్నారు. వాళ్లంతా ఉద్యోగస్తులా? చెప్పండి" అన్నాడు సూర్యం.

"మరి ఇలా రిక్షా తొక్కడం హీనం కాదా?" అడిగాడు శేషగిరి.

అతను కొద్దిగా నవ్వి- "హీనమా? ఎంతమాటన్నారండీ- మరి ఉద్యోగం ఉన్నతమా? ఒక్కరోజు ఆఫీసుకు వెళ్లకపోతే సంజాయిషీ అడుగుతారు. వర్కు బాగాలేదని ఇంక్రిమెంటు ఆపేస్తారు. అది హీనంకాదా? ఏడుకొండల వెంకన్న అనుగ్రహం ఉంటేతప్ప ప్రమోషన్ వస్తుందన్న గ్యారంటీ లేదు. డబు తీసుకున్నా ఖర్చుచేసినా బ్లాక్‌మనీ అంటారు. ఇది గౌరవప్రదమా? బాగా సంపాదించి మూటగడితే కొడుకులూ, కూతుళ్లు పీక్కుతింటారు. ఏమీ సంపాదించకపోతే చేతకాని వాడంటారు. ఆస్తులు కొనాలంటే దడ- అమ్మాలంటే నామర్దా. దాచిపెట్టడానికి భయం భయం- ఇదంతా హీనం కాదా? ఇలాంటివేమీ లేకుండా ఏ చిన్న కంపెనీలోనో సాదాసీదా నౌఖరీ చేస్తే అసలు బ్రతుకే సాగదు. మరి నాకు ఈ బాధలేం లేవు. రోజూ సలభై రూపాయల సంపాదన. నేను ఉద్యోగస్థుణ్ణి కాదుకనుక నాకు భేషజాలు ఏమీలేవు. మా ఇంట్లో ఎప్పుడూ ఫ్రిజ్‌లూ, ఎయిర్‌కూలర్లూ, ఫోమ్‌బెడ్లూ, ఎ.సి.లు లాంటివేం లేవు. వాటి రిపేర్ల ఖర్చులేదు. ఫ్యాషన్ పేరిట ఖర్చులు లేవు. మా ఆవిడ రైస్‌మిల్‌లో పనిచేస్తుంది. రోజూ ఇరవై రూపాయలు తెస్తుంది. కమ్మగా వండి పెడుతుంది. ఈ రిక్షా కాక నా స్వంత రిక్షాలు మరో రెండు ఉన్నాయి. వాటికి అద్దెలొస్తాయి. నాలుగేళ్ల క్రితం చిన్న పెంకుటిల్లు కొన్నాను. నేను ఎప్పుడూ త్రాగను. ఏ ఆదివారం రిక్షా తొక్కను. ప్రతి శుక్రవారం అమ్మవారి గుడికి మా ఆవిణ్ణి తీసుకెళ్ళి, అక్కడినించి పోయి సినిమా చూపించి తీసుకొస్తాను. నా టైము నా చేతుల్లో ఉంటుంది. నా వృత్తి హీనమన్నారు మీరు. ఇప్పుడు చెప్పండి సార్. ఏమంటారు?" అన్నాడు.

ఏ మనడానికీ ఏం తోచలేదు శేషగిరికి.

సూర్యమే మళ్ళీ అన్నాడు- "డబ్బుతోనే స్టేటస్ ఉందని- స్టేటస్ పెరిగితే నాగరికత పెరిగినట్టే అనీ అనుకోడం వల్లనే సమాజం ఇలా ఉంది".

ఇంతలో ట్రాఫిక్ క్లియర్ అయింది. రిక్షా కదిలింది.

ఆ రాత్రి భోజనాలయ్యాక డబల్‌కాట్ మీద నడుం వాల్చిన శేషగిరికి మళ్లీ మళ్ళీ సూర్యం మాటలే గుర్తుకొస్తున్నాయ్.

అతను చెప్పిన దాంట్లో జీవితపు విలువలు ఉన్నాయి. దూరదృష్టి ఉంది. అతని బ్రతుకు హీనమని తను అనడం సబబుగా లేదేమో.

మరి తన జీవితం ఎలా నడుస్తోంది?

"ఊపిరి సలపని భయం, పెట్టినా గ్రాంట్ అవుతుందని నమ్మకం లేదు. క్రింద ఉద్యోగస్తులికి తనపై ఈర్ష్య. పై ఆఫీసర్లకి చిన్న చూపు. పై సంపాదన వల్ల అడుగడుగునా భయం భయం. మూటగట్టిన దానికి ఇంట్లో వాళ్లకి సంతోషం లేకపోగా ఇంకా ఎక్కడ ఎంత దాచి పెట్టేడో అన్న అనుమానం. 'ఇంత సంపాదిస్తున్నాడు- ఇతగాడికి మరో చోట 'చిన్న - ఇల్లు' వ్యవహారం ఉండకుండా ఉంటుందా అనుకుంటూన్న బంధుమిత్ర పరివారం, అందులో తన భార్యకు మినహాయింపు లేకపోవడం, జీతానికి రెట్టింపు ఇంటి ఖర్చు, అందులో సగం ఫ్యాషన్లకీ, భేషజాలకీ, ఎం.ఎ. ప్యాసయ్యే వరకూ ఆగి, ఆపైన ఉద్యోగం వచ్చే వరకూ ఆగి, 'ఫ్యాషన్ పెరేడ్'లో తన ముప్పైయ్యవ ఏట పెళ్లి చేసుకున్నందుకు ఇప్పటికి ఇంకా పన్నెండేళ్లయినా నిండని కొడుకు, ఏడేళ్ల కూతురు, పని ఒత్తిడిలో అనుకోకుండా

మీనాక్షితో కుదిరిన లింకు, సాఫీగా సాగుతున్న ఈ అఫైర్‌లోంచి ఎప్పుడు పొగ లేస్తుందో అన్న జంకు, కొడుకుని ఇంజనీర్ చెయ్యాలనే ఆశ, కూతుర్ని డాక్టరీ చదివించాలనే కుతూహలం, రిటైర్ అయ్యేలోపల ఓ మేడ లేపాలన్న ఆలోచన. సూర్యం లాగ తనకి ఆదివారాలు రెస్ట్ ఉందా? ప్రతి శుక్రవారం కాదు సరిగదా నెలలో ఏ ఒకనాడైనా భార్యను కూడా సినిమాలకి తీసుకువెళ్లగలిగాడా? సూర్యానికీ తనకీ ఎంత తేడా? ఎక్కడుందీ ఈ తేడా?

జీవిత దృక్పథంలో ఉంది. స్వేచ్ఛలో ఉంది.

ఏది ఏమైనా అతని బ్రతుకు హీనమనే అనాలి. అర్థం పర్థం లేకుండా తనకు తోచిన పంథాలో పోతున్నాడు. పిల్లల్ని చదివించకుండా, లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యకుండా - అదీ ఓ బ్రతుకేనా?'' ఇలాంటి'ఆలోచనలతో ఆ రాత్రి గడిచింది.

ఆ తర్వాత కూడా సూర్యం అతనికి జ్ఞాపకం వస్తూనే ఉన్నాడు.

మూడేళ్ళు గడిచాయి.

శేషగిరికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది.

ఈ మూడేళ్లలో సూర్యం రిక్షా చాలాసార్లు ఎక్కాడతను. ఏవేవో విషయాలు సూర్యం చెబుతూనే ఉన్నాడు.

ఆ ఊరు నించి శేషగిరి మకాం మార్చేసాడు.

ఆ తర్వాత ఇద్దరూ కలవడం తటస్థించలేదు.

మరో పదిహేనేళ్ళు గడిచాయ్.

ప్రమోషన్ పోస్టులో రిటైర్ అయ్యాడు శేషగిరి.

సర్వీసులో టైర్ అయిపోయిన వాళ్ళకి రిటైర్‌మెంట్ ఓ వరం అంటారేగాని - నిజానికి అది వరంలా లేదతనికి.

ఒంట్లో అనారోగ్యం ఉ- ఆయాసం.

ఇంట్లో, భార్య వల్ల ఏవో గొడవలు- అశాంతి.

స్వంత ఊరు విజయవాడలో సెటిల్ అయ్యాడు.

అలాగే మరో ఐదేళ్లు గడిచాయ్.

ఇంట్లో అశాంతి మరింత పెరిగింది.

దూరాన ఉన్న కోడలు ద్వారా కొడుకు పెడుతున్న క్షోభ, ప్రక్క ఊళ్లోనే లాయరుగా ఉంటూన్న అల్లుడి ద్వారా కూతురు రాజేస్తున్న కుంపటి - తట్టుకోలేకపోతున్నాడు శేషగిరి.

మీనాక్షిలాంటి వాళ్లకి చేరవేసిన మొత్తమెంతో తేల్చే వరకూ వండి వడ్డించడమే దండగ అన్నట్టుంది భార్యామణి ధోరణి. గవర్నమెంటు ఇంజనీరుగా ఎనిమిది వేలు జీతం తెచ్చుకుంటూ హైదరాబాద్‌లో కుషీ వెలిగిస్తున్న కొడుకునించి ఆరు నెలల కోసారైనా ఉత్తరం రాదు. కొడుకూ కోడలూ కలిసి రెండేళ్లకోసారైనా రారు. విడిగా కొడుకుని కోడలు రానివ్వదు. మనవడితో ఆడుకునే యోగమేలేదు. పుచ్చుకున్నదంతా మరిచిపోయి ఇంకా ఆశిస్తున్న దానికి లెక్కలు పంపిస్తాడు. అల్లుడు క్రింద తన అర్థాంగి సంతకంతో "ఉంది కదా - ఇవ్వడానికి ఎందుకంత ఏడుపు?" అన్నవాళ్ల లా పాయింటు.

స్నేహనయనాలతో నడిచి వచ్చే భవిష్యత్తు కోసం శేషగిరి ఎదురు చూశాడు ఇంతకాలం. కాని జీవితం చివరికి మిగిల్చిందిదీ. తన వాళ్లు అనుకున్న వాళ్ళనించే శత్రుత్వపు సెగలు! కులరాజకీయాల మధ్య సర్వీసులోనూ ప్రశాంతత కనిపించలేదు. తనను బెదిరించి పై ఆఫీసర్లు బాగుపడ్డారు. రిటైర్‌మెంట్ ముందు ప్రమోషన్‌కని చేతి చమురు చాలా వదిలింది.



'ఏమోయ్ ఈ రోజు మన పెళ్ళి రోజుగా? కాకరకాయ కూరెందుకు వండుతున్నావు?' అడిగాడు భర్త.

'ఆనాటి చేదు సంఘటనలు నెమరువేసుకుందామని?' చెప్పింది భార్య.

- ఎ. వినోద్,
తెనాలి.

పాండవులు గెల్చింది కౌరవుల దినవారాలకే సరిపోయినట్టు 35 సంవత్సరాల సర్వీసులో తాను మూటగట్టిన దాంట్లో ఖర్చులు పోను మిగిలింది కూలుతున్న కొంపను నిలబెట్టుకోవడానికి మాత్రం సరిపోయింది.

ఇప్పుడు శేషగిరికి ఆరోగ్యం అదుపు తప్పింది. బాగా నీరస పడ్డాడు. ఆయుషు మీద అనుమానం వేచింది. వీటన్నింటికి అసలు కారణంపైవి చెప్పుకోలేని పశ్చాత్తాపం. తెలిసి కొన్నీ తెలియక కొన్ని అతను తప్పులు చేసిన మాట నిజం. కాని వాటి పర్యవసానం ఇంత పదునుగా ఉంటుందనుకోలేదు.

తీసుకోడమే గాని ఇవ్వడం తెలియని చేతులవి. కనుక ఇప్పుడు చేయూతనిచ్చేవాళ్లే కరువయ్యారు.

అసలు పలకరించే వాళ్లే లేరు.

ఒకప్పుడు హుషారుగా షికార్లు చేసిన శరీరం.

ఇప్పుడు తహతహ చచ్చిన శరీరం.

కనురెప్పలపై పేరుకుంటున్న నైరాశ్య స్పందనలు.

భాష ఎరుగని మనసు పడే తరగని వేదన.

నిస్సహాయతలోంచి పుట్టుకొచ్చే ఆవేశంలో అతనిలోంచి ఎప్పుడేనా ఓ అరుపు లేస్తుంది. కాని ప్రయోజనం శూన్యం.

అసలు వస్తుతః అతను మంచి ఆలోచనాపరుడు. రచయిత. అయితే ఆధునికలోనే ఔన్నత్యం ఉందనుకున్నాడు. హోదాలోనే నాగరికత ఉందనుకున్నాడు. దేవుడు, భక్తిలాంటి వాటి ప్రసక్తే లేదు. ఎన్నో పుస్తకాలు చదివాడు. కాని గీతలాంటి గ్రంథాలేమీ తిరగెయ్యలేదు. అత్యంత ఆధునిక నిలయమైన అమెరికాలాంటి దేశాలతో సహా ప్రపంచంలో ఇప్పుడు 'ఆధ్యాత్మిక అన్వేషణ' జరుగుతున్న విషయం అతనికి తెలియదు.

గత కాలపు కర్మకీ నుదుటి రాతకీ సంబంధం ఉన్నట్టే, చేసే చేతకీ, మనిషి భవిష్యత్తుకీ ముడి ఉందనే సంగతి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. భగవద్గీత ఓసారి తెరవాలనిపిస్తోంది.

• ఓ రోజున బీసెంట్ రోడ్డులో అనుకోకుండా అతనికి సూర్యం కనిపించాడు.

'ఎంత ఆరోగ్యంగా ఉన్నాడో అనిపించింది అతన్ని చూడగానే. చాలా యాక్టివ్‌గా ఉన్నాడు - తల నెరిసింది తప్ప. అదే డ్రస్సు. అదే మాట. కుశల ప్రశ్నల అనంతరం అతన్నాడు -

"మా రెండోవారు ఇక్కడే ఉంటున్నాడండి పాతికేళ్ల బట్టి. వాణ్ణి ఇక్కడికి పంపించేసినట్టు తమకి నేను లోగడ చెప్పినట్టు గుర్తు. మేమంతా కలిసే ఉంటున్నామండి ఇక్కడ. వాడు పటమటలో ఓ ఇల్లు కొన్నాడండి. నన్ను రిక్షా తొక్కనివ్వడం లేదు. ఈ వయస్సులో ఇంకా అదేం పని అంటున్నాడు."

"సంతోషం. అది సరే - నేను రిటైరై దాదాపు పదేళ్లయింది. మాదీ అసలు ఈ ఊరే! ఇక్కడే సెటిల్ అయిపోయాను. సత్యనారాయణపురంలో మా ఇల్లు" అని చెప్పి ఇంకా కొన్ని కుటుంబ విషయాలు చెప్పాడు శేషగిరి.

అర్థమైపోయింది సూర్యానికి.

"సార్, మీరు చాలా చిక్కిపోయారండి" అన్నాడు బాధగా.

శేషగిరి ఇంటికే వెడుతున్నట్టు తెలుసుకుని- "ఇల్లు చాలా దూరం కదండి. ఉండండి- మిమ్మల్ని కారులో పంపిస్తాను, రండి" అన్నాడు.

"కారు అంటాడేంటి?" అనుకున్నాడు శేషగిరి.

"మా అబ్బాయి కారండి. అందులో తమర్ని మీ ఇంటి దగ్గర దింపి రమ్మని చెప్పి పంపుతాను. వాడికి ఇంకో కారు కూడా ఉందండి. ఒకటి ఊళ్లోనే తిరిగితే ఒకటి బయటి ఊళ్లకి వెడుతుందండి" అన్నాడతను.

శేషగిరి ఆశ్చర్యపోయాడు.

ఫోన్‌చేసి కారు తెప్పించాడు సూర్యం.

తీరా కారెక్కాక "సార్, తమరు మా ఇంటికి ఓసారి రారా? రమ్మని నా కోరిక. తక్కువవాణ్ణే అనుకోండి. అయినా తమరు రాకతప్పదు" అన్నాడు.

'సరే' అని శేషగిరి అనడంతో కారుని పటమట పోనివ్వమని కొడుక్కి చెప్పాడు.

ఇంటిముందు ఆగింది కారు. ఇల్లు చాలా బాగుంది. అధునాతనంగా, అందంగా ఉంది.

లోపల టీ తాగి బయటికి వస్తూంటే పక్కనే ఉన్న మరో ఇల్లు సరిగ్గా ఇలాగే ఉండడం చూసి, "కవలపిల్లల్లా ఉన్నాయి ఈ రెండు బిల్డింగ్సూ" అన్నాడు శేషగిరి.

"ఔనండి. అది మా పెద్దోడు కొనుక్కున్నాడండి" అన్నాడు సూర్యం.

"నేను మీ ఇంటికి వచ్చాను. మరి నువ్వూ మా ఇంటికి రావాలి" అనాలనిపించింది శేషగిరికి. కాని మాట పెదవి దాటి రాలేదు.

"ఏ మొహం పెట్టుకుని అతన్ని ఆహ్వానించగలవ్?" అని మనస్సు గొణిగింది. మౌనంగా ఉండిపోయాడు. కారులో అతన్ని ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్లిపోయాడు సూర్యం కొడుకు.

నేరుగా తన గదిలోకి వెళ్లాడు శేషగిరి.

చీకటిగా ఉంది గది. ఈజీ చైరులో పడుకుని కళ్లు మూసుకున్నాడు. మౌనంగా చాలాసేపు అలాగే ఉండిపోయాడు.

భార్యను పిలిచి ఏదో చెప్పాలనుకున్నాడు.

ఇంతలో మౌనమే మంచిదనిపించింది. ఆమెను పిలవనేలేదు.

అప్పుడే ఎవరో వచ్చి ఎదురుగా నిలబడి-

"ఏదీ మన చేతుల్లో లేదు. కాలం చాలా శక్తివంతమైంది. కాని పనులనీ, కానులమీద ఆశల్నీ కాలం చూస్తూ ఊరుకోదు" అన్నట్టయింది.

కళ్లు తెరిచాడు - ఎవరూ లేరు.